సాక్షి
ఖమ్మం
బుధవారం । 17 । జూలై । 2024



క్రీడాపోటీలకు సై !

అండర్ - 14, 17, 19 విభాగాల్లో క్రీడాపోటీల నిర్వహణకు మునుపెన్నడూ లేని విధంగా ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 8లో



కెనాల్ పనుల్లో వేగం పెంచాలి

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి లింక్ కెనాల్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులు ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బెటాలియన్ నూతన కమాండెంట్‌గా చటర్జీ



చటర్జీ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా జెస్కెల్ చటర్జీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయనను డీజీపీ కార్యాలయం నుంచి బెటాలియన్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా అదనపు కమాండెంట్ పి.వెంకట్రాములు కమాండెంట్ చటర్జీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకగా బాధ్యతలు స్వీకరించాక వివిధ విభాగాల ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతి రంగారెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

82 మందికి 'సదరమ్' అర్హత



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో 82 మంది దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. మొత్తం 160 మంది స్లాట్ బుక్ చేసుకోగా 129 మంది క్యాంపునకు హాజరయ్యారు. వీరికి విభాగాల వారీగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు 82 మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

'నవోదయ'లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కూసుమంచి: నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీచేసింది. ఈమేరకు కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో సెప్టెంబర్ 16వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

జెడ్పీ ఉద్యోగుల బదిలీలు పూర్తి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మంగళవారం పూర్తయింది. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఓ హరికిషన్ సమక్షాన కౌన్సెలింగ్ నిర్వహించారు. జోనల్ కేడర్‌కు సంబంధించి పది మంది సూపరింటెండెంట్లు, ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 36మంది జూనియర్ అసిస్టెంట్లు, 20మంది రికార్డ్ అసిస్టెంట్లు, ఎనిమిది మంది టైపిస్టులు, ముగ్గురు ల్యాబ్ అసిస్టెంట్లతోపాటు ఇద్దరు వాచ్‌మెన్లు, 79మంది ఆఫీస్ సబార్డినేట్లను కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించారు. బదిలీ అయిన వారి జాబితాను కలెక్టర్‌కు సమర్పించి ఉన్నతాధికారుల ఆమోదం లభించాక ఈనెల 21లోపు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని జెడ్పీ సీఈఓ వినోద్ తెలిపారు.

మత్స్యశాఖలో కౌన్సెలింగ్

ఖమ్మంవ్యవసాయం: మత్స్యశాఖలో వివిధ కేడర్ల అధికారులు, ఉద్యోగుల బదిలీలకు హైదరాబాద్‌లోని శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ మొదలైంది. కాగా, జిల్లా ఇన్‌చార్జి మత్స్య శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డి.ఆంజనేయస్వామి మల్టీ జోన్ -1లో బదిలీ ఆప్షన్ ఇవ్వగా.. ఆయన సైతం కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జోన్-1 పరిధిలోని ఖమ్మం, హన్మకొండ, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఆయనను నియమించే అవకాశమున్నట్లు తెలిసింది.

మున్సిపల్ అధికారులకు నేడు..

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్, కార్పొరేషన్ కార్యాలయాల అధికారులు, ఉద్యోగుల బదిలీ ప్రక్రియ బుధవారం జరగనుంది. ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహించాలని తొలుత నిర్ణయించినా, బుధవారమే చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈనేపథ్యాన ఆప్షన్ ఇచ్చిన మేనేజర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, ఏఓలు, జేఏఓలు 17న మధ్యాహ్నం 3 గంటలకు సీడీఎంఏ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

వ్యయ వివరాలు వెల్లడించని అభ్యర్థులకు నోటీసులు

నేలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో వ్యయ వివరాలు వెల్లడించని ఇద్దరికి ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎన్నికల నియామవళి ప్రకారం పోటీ చేసిన అభ్యర్థులు ప్రచారానికి వెచ్చించిన ప్రతీ ఖర్చు వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. కానీ పాలేరులో రామిరెడ్డి సుంకిరెడ్డి, రామసహాయం మాధవీరెడ్డి వివరాలు సమర్పించకపోవడంతో నోటీసులు జారీ అయ్యాయి. వీరు పది రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని అందులో ఆదేశించారు.

సాగు.. సాగేదెలా?

జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాగర్ రెండో జోన్ పరిధిలోని 2,54,270 ఎకరాల సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టు వట్టిపోయింది. గత ఏడాది ఇదే సమయానికి సాగర్ జలాలు విడుదల చేయగా.. ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి. ఈ ఏడాది సాగర్ జలాలు ఎప్పుడు విడుదలవుతాయోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, పైనుంచి నీరు రాక జిల్లాలోని పాలేరు, వైరా రిజర్వాయర్లు, లంకాసాగర్ ప్రాజెక్టు కళ తప్పగా.. మిగతా చెరువులూ వెలవెలబోతున్నాయి. ఫలితంగా సాగు ఆలస్యమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



డెడ్‌స్టోరేజీకి చేరిన పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

'సాగర్'లో అడుగంటిన నీరు

- ఎగువన వర్షాలు లేకపోవడంతో నిండని ప్రాజెక్టు
- ప్రశ్నార్థకంగా 2.54 లక్షల ఎకరాల సాగు
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం
- మరోపక్క జిల్లాలో కళతప్పిన ప్రాజెక్టులు, చెరువులు

ఆ నీరే ఆధారం..

జిల్లాలో పంటల సాగుకు సాగర్ జలాలే ప్రధాన ఆధారం. అంతేకాక ప్రాజెక్టుపై పాలేరు, వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులతో పాటు పలు చెరువులు ఆధారపడి ఉన్నాయి. సాగర్ కాల్వల ద్వారా నేరుగా జిల్లాలోని 17 మండలాల్లో 2,54,270 ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. ఎత్తిపోతల పథకాల ద్వారా మరో 25,226 ఎకరాలు సాగవుతున్నాయి. ఏటా వానాకాలంలో ఈ సమయానికి సాగర్ నీటి విడుదల షెడ్యూల్ ఖరారయ్యేది. అందుకనుగుణంగా రైతులు సన్నద్ధమయ్యేవారు. కానీ ఈసారి నీరు లేక షెడ్యూల్ రాకపోవడంతో... ఎగువన వర్షాలు కురిస్తే ఆలస్యంగానైనా నీరు విడుదల చేస్తారనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

రెండు రోజుల ముసురుతో..

ఓవైపు సాగర్ జలాల విడుదలపై సందిగ్ధత నెలకొనడం, ఇప్పటి వరకు సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో రైతులు పూర్తిస్థాయిలో సాగు పనులు ప్రారంభించలేదు. తొలకరిలో పొడిదుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటగా, ఆ తర్వాత వరి నార్లు పోసి వేచి చూస్తున్నారు. నాలుగైదు రోజులుగా ముసురు పట్టి వర్షాలు కురుస్తుండటంతో బోర్ల కింద భూములు ఉన్న రైతులు నాట్లు వేయడం, నార్లు పోయడం తోపాటు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేపట్టారు. కానీ ఏ ఆధారం లేని ఆయకట్టు రైతులు సాగర్ ఎప్పుడు నిండుతుందని ఎదురుచూస్తున్నారు. మరోపక్క సాగర్ జలాలు విడుదల కాక మధిర మండలంలోని నాగవరప్పాడు, నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లి ఊరచెరువు తదితర చెరువుల కింద కూడా సాగు ప్రారంభించలేదు.

సాగర్‌లోకి నీటి జాడ కరువు

వానాకాలం ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా కృష్ణా పరీవాహక ప్రాంతంలో సరైన వర్షాలు లేక నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేదు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు ప్రస్తుతం 120.09 టీఎంసీల నీరే ఉంది. అంటే డెడ్ స్టోరేజీకి చేరుకున్నట్లే. అక్కడి నుంచి నీటి విడుదల లేక పాలేరు రిజర్వాయర్ సైతం అడుగంటింది. ఇక సాగర్ ఆయకట్టు పరిధిలో దాదాపు 984 చెరువులు ఉండగా.. ఇందులో 500 చెరువులు 25 శాతం కూడా నిండలేదు. పాలేరు నియోజకవర్గంలో 201 చెరువులకు ఏ ఒక్కటీ 25 శాతానికి మించి నిండక పోగా, మధిరలో 121 చెరువులకు 110 చెరువుల్లో 25శాతం మాత్రమే నీరు చేరింది. మరోపక్క వైరా నియోజకవర్గంలోని 205 చెరువుల్లో 178 చెరువులు 50 శాతం కూడా నిండలేదు.

పాలేరులో 6.5 అడుగులే..

పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కేవలం 6.5 అడుగుల నీరు మాత్రమే ఉంది. 23 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి నీరు రాక డెడ్ స్టోరేజీకి చేరింది. గత ఏడాది జూలై 16న పాలేరులో 17 అడుగుల మేర నీరు ఉంది. ఆ సమయాన వర్షాలు కురవడం, జూలై 12 నుంచే సాగర్ జలాలు విడుదల చేయడంతో 22వ తేదీ నుంచి అలుగు పారింది. కానీ ఇప్పుడు డెడ్‌స్టోరేజీలో ఉంది. ఇక వైరా, లంకాసాగర్ ప్రాజెక్టుల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది.

నార్లు పోయలేదు..





ఇది మధిర మండలం నాగవరప్పాడు చెరువు. ఈ చెరువు పరిధిలో 110 ఎకరాల ఆయకట్టు ఉండగా.. సాగర్ నీరే ఆధారం కావడంతో నిండలేదు. దీంతో ఇప్పటి వరకు ఆయకట్టు రైతులు వరినార్లు కూడా పోయలేదు. ఏటా ఈ సమయానికి వరి నాట్లు సైతం పూర్తయ్యేవి. ఇప్పుడు సాగర్ నీళ్ల రాక, వర్షాలు లేక అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చెరువు కింద ఎకరం భూమి కలిగిన నాగవరప్పాడు గ్రామ రైతు తోకా వెంకయ్యను పలకరిస్తే నీరు లేని కారణంగా సాగు చేయలేదని చెప్పాడు. వరి పండిస్తేనే తమ కుటుంబానికి పట్టెడన్నం లభిస్తుందని.. ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఇదీ నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి ఊరచెరువు పరిస్థితి

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వ పరిస్థితులు (అడుగుల్లో)

ప్రాజెక్టు	ఫుల్ రిజర్వాయర్ లెవల్	ప్రస్తుతం నిల్వ
పాలేరు	23	6.5
వైరా	18.03	8
లంకాసాగర్	16	13.06
బేతుపల్లి	16	16
జాలిముడి	15	15.24
కట్టలేరు	7	8

జిల్లాలో చెరువుల వివరాలు

మొత్తం	984
25 శాతం నిండినవి	500
50 శాతం నిండినవి	95
75 శాతం నిండినవి	295
100 శాతం నిండినవి	78
మత్తడి పోస్తున్న చెరువులు	16

సాగు ప్రశ్నార్థకంగా ఉంది..



గత ఏడాది నీళ్ల లేక సాగు చేయకపోగా, ఈసారీ అలాగే మారింది. నారు సిద్ధం చేసినా నాట్లు వేయాలంటే సాగర్‌లోకి నీళ్లు రాకపోవడంతో ఎదురు చూస్తున్నాం. భూగర్భ జలాలు లేకపోవడంతో బోర్లు, బావుల కింద సాగు చేయాలన్నా రైతులు భయపడుతున్నారు. కనీసం కంది, పెసర పంట సాగు చేద్దామంటే సీజన్ అయిపోయింది

– బుర్ర నాగభూషణం, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

రైతు రుణమాఫీలో షరతులు వద్దు..

- ఆశించిన స్థాయిలో లేని కాంగ్రెస్ పాలన
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన నాయకులు

మధిర: ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. మధిర మండలం దెందుకూరులో జరుగుతున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొర్రీలు విధించడం సరికాదన్నారు. ఇక రుణమాఫీలో కౌలు రైతులకు ప్రభుత్వం తీరని నష్టం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఆశించిన స్థాయిలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో బడ్జెట్ సమావేశాల్లో విద్య, వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని, గ్రామసభల ద్వారా కౌలు రైతులను ఎంపిక చేసి రైతు భరోసా ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నందున తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించిన తమ్మినేని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే సీపీఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో వామపక్షాల, ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్మించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కాగా, సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు పాత డిజైన్ ప్రకారమే పూర్తి చేయాలని, ప్రాజెక్టుల నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబర్‌లలో జరిగే అవకాశమున్నందున సీపీఎం శ్రేణులు సిద్ధంగా ఉండాలని తమ్మినేని కోరారు.

రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ లక్ష్యం

అమల్లో ఉన్న రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ లక్ష్యమని.. అందుకే బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా తీసుకున్నట్లు వీరభద్రం తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు పోరాటాలు నిర్వహించాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ బలం తగ్గి బీజేపీ బలం పెరగడం ప్రజలకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, తాజా లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ బలం తగ్గినా పాలనలో తేడా ఉండకపోగా.. లౌకికతత్వం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణపు వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, యనమదల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున అర్చకులు గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి.

● సీఎం సమావేశంలో కలెక్టర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వాన హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.

– ఖమ్మం సహకారనగర్

ఫిజియోథెరపీ సేవలకు బ్రేక్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఫిజియోథెరపీ సేవలకు ఆటంకం ఎదురవుతోంది. థెరపీకి వినియోగించే సామగ్రి మరమ్మతుకు రావడంతో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పెద్దాస్పత్రిలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభించి మూడేళ్లు కావొస్తుండగా, ఇటీవల కీలకమైన టెన్స్, లీడ్స్, ఇన్‌ఫ్రారెడ్ లైట్లు మరమ్మతుకు వచ్చాయి. మార్చి నెలలో టెన్స్, లీడ్స్ మిషన్లు చెడిపోగా, ఇన్‌ఫ్రారెడ్ లైట్లు వారం రోజుల నుంచి పనిచేయడం లేదు. వీటి సాయంతో వెన్ను, భుజం, మోకాళ్ల నొప్పితో బాధపడే వారికే కాక పక్షవాతం బారిన పడిన వారికి రెండు నెలల నుంచి మూడు నెలల పాటు ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తారు. నిత్యం పరీక్షలకు 20 నుండి 30 మంది, చికిత్స కోసం 20 మందికి పైగా వస్తుంటారు. అయితే, సెంటర్‌లోని పలు పరికరాలు మూలన పడడంతో కొందరు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు ఫిజియోథెరపిస్ట్ సెలవులో ఉండగా.. పాలియేటివ్ కేర్‌లో సెంటర్ నుంచి అప్పుడప్పుడు ఉద్యోగి వెచ్చి వెళ్తున్నాడు. మిగతా సమయంలో పేషంట్ కేర్‌లో సిబ్బందితో పని కానిచ్చేస్తున్నారు. ఇకనైనా శాశ్వత టెక్నీషియన్‌ను నియమించడమే కాక పాడైన పరికరాలను మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.



టెక్నీషియన్‌కు బదులు చికిత్స చేస్తున్న పేషంట్ కేర్ ఉద్యోగి

● ఇటు చూస్తున్నారా ?!



అసలే వర్షాకాలం.. నీరు నిలిచి మురుగుమయమైతే దోమలు పెరిగి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయని అందరికీ తెలిసిందే. ఈ విషయమై ప్రజలకు మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ మధిర మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోనే ఇటీవలి వర్షాలకు నీరు నిలిచి బురదమయమైంది. ఏదైనా చెప్పుకుందామని వచ్చే స్థానికులు ఈ పరిస్థితిని చూసి తమ సమస్యనేం పట్టించుకుంటారులే అని వెనుతిరిగి వెళ్తున్నారు. – మధిర

నాకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా...

- కన్నతల్లి వంటి పార్టీలో కష్టపడిన వారందరికీ పదవులు
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: రైతు బిడ్డనైన తనకు రైతులు పండించిన ఉత్పత్తులను నిల్వ చేసేందుకు ఉపయోగపడే గిడ్డంగుల శాఖను ఇచ్చిన నేపథ్యాన పదవికి వంద శాతం న్యాయం చేసి పార్టీ, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తానని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు వెల్లడించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి మంగళవారం ఖమ్మం వచ్చిన ఆయన కాంగ్రెస్ కార్యాలయంతోపాటు ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సన్మాన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పడానికి తానే నిదర్శమన్నారు. అలాగే, పార్టీలో కొనసాగుతూ ఆనాటి అధికార పార్టీ వేధింపులను తట్టుకున్న వారందరికీ సముచితస్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల భద్రత కోసం గిడ్డంగులు ఉన్నా.. దిగుబడులు పెరుగుతున్నందున మరిన్ని గోడౌన్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, దివంగత వైఎస్సార్ హయాంలో ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను తీసుకువచ్చి పేదలకు మేలు చేశారని గుర్తు చేశారు. ఇక అర్హులైన రైతులకే రైతు భరోసా అందేలా త్రిసభ్య కమిటీని నియమించడంతో స్వయంగా మంత్రులే ఉమ్మడి జిల్లాల వారీగా అభిప్రాయాలు సేకరిస్తున్నారని నాగేశ్వరరావు చెప్పారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడితే పదవులు ఖాయం

కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి వంటిదని, పార్టీలో కొనసాగుతూ కష్టపడే వారికి పదవులు వాటంతట అవే వస్తాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నాగేశ్వరరావు పార్టీని వదిలిపెట్టలేదని, పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేశారని గుర్తు చేశారు. అనంతరం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు మహ్మద్ జావేద్, తుంబూరు దయాకర్‌రెడ్డి, కమర్తపు మురళి, మొక్కా శేఖర్‌గౌడ్, నాగా సీతారాములు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, శ్రీమంతా రాక్స్ పుసులూరి నరేందర్ మాట్లాడారు. కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, ముజాహిద్ హుస్సేన్, దాసరి డానియేలు, బొమ్మిడి శ్రీనివాస్‌యాదవ్, గోకినపల్లి వెంకటేశ్వర్లు, ఎర్రా శ్రీకాంత్, వాసిరెడ్డి రామనాథం, పగడాల మంజుల, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల వీరభద్రం, కొప్పెర ఉపేందర్, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, కొప్పుల చంద్రశేఖర్, వడ్డెల్లి కృష్ణమూర్తి, ఆర్‌ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి క్యాంప్‌లో సత్తుపల్లి కేడెట్


కేడెట్‌ను అభినందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ మెచ్చు ఆదర్శ్ జాతీయ స్థాయి క్యాంపులో పాల్గొన్నాడు. ఒడిశాలోని రూర్కెలా ఎన్ఐటీలో ఇటీవల జరిగిన నేషనల్ అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు రాష్ట్రం తరపున ఆయన ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా టీమ్‌వర్క్, తదితర అంశాలపై అవగాహన కల్పించి ప్రశంసాపత్రం అందుకోగా, మంగళవారం ఆదర్శ్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేర్ టేకర్ రవికుమార్ అభినందించారు.

ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా జిల్లా వాసి


సూర్యదేవర ప్రసన్నకుమార్

బోనకల్: బోనకల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సూర్యదేవర ప్రసన్నకుమార్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా నియమితులయ్యారు. ఆయన తండ్రి జానకీ రామయ్య కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా 1982 నుండి ఆరేళ్లు పనిచేశారు. అప్పట్లో ప్రసన్నకుమార్ అదే కళాశాలలో ఇంటర్ పూర్తి చేయగా.. విద్యార్థి సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు. కాగా, జానకీరామయ్య రిటైర్డ్ అయ్యాక ఖమ్మంలో నివాసముంటున్నారు. ప్రసన్నకుమార్ గతంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా, లోక్‌సభ స్పీకర్ ఓఎస్డీగా, ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయ ఓఎస్డీగా విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది జనవరిలో ఆయన తెలంగాణ అసెంబ్లీ సలహాదారుడిగా నియమితులవగా, ప్రస్తుతం ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా అక్కడి ప్రభుత్వం నియమించింది.

బాధ్యతల నుంచి ఇన్‌చార్జి ఎస్‌ఐల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు(ఎస్‌ఐ)గా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరిని ఆ బాధ్యతల నుండి తొలగించారు. ఈనెల 13న 'సాక్షి'లో 'అనుగ్రహం ఉంటే అర్హత ఎందుకు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై వస్తున్న ఆరోపణలను విచారించి ఇద్దరిని జవాన్లుగా వెనక్కి పంపినట్లు తెలిసింది.

బాలలను పనిలో పెట్టుకుంటే సహించేది లేదు..

నేలకొండపల్లి: బాలలతో పనిచేయించే యజమాన్యాలపై చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వెంగమాంబ హెచ్చరించారు. మండల కేంద్రంలో ముస్కాన్ బృందాల ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో ఓ మెకానిక్ షాపులో పని చేస్తున్న మైనర్‌ను గుర్తించి యాజమానిపై కేసు నమోదు చేశారు. అనంతరం వెంగమాంబ మాట్లాడుతూ ప్రతీ షాపులో మైనర్లు పని చేయడం లేదని బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబల్ శ్రీనివాసరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రతినిధులు భాస్కర్, హరిప్రసాద్, విమల, సతీష్, చిన్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మం అర్బన్: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఖమ్మం అర్బన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఖమ్మం ఖానాపురానికి చెందిన 13ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెకు ఖమ్మం వాసి, హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చేస్తున్న యువకుడితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు సోమవారం బాలికకు మాయమాటలు చెప్పి ద్విచక్రవాహనంపై తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లాక విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం మంగళవారం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,700	7,600
కందులు	7,000	7,000
అలసంద	7,700	7,700
మిర్చి	17,000	9,050
ఏసీ మిర్చి	19,300	10,000
ఏసీ తాలు	10,500	7,000
పత్తి	7,400	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

పాఠశాలల క్రీడా పోటీలకు సై!

- గతంలో మాదిరి కాకుండా ముందస్తు క్యాలెండర్
- సెప్టెంబర్‌లో నిర్వహించేలా ప్రణాళిక
- మూడంచెల్లో అండర్–14, 17 విభాగాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- అండర్ – 19 మాత్రం నేరుగా జిల్లా స్థాయిలోనే..


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జిల్లా పాఠశాలల స్థాయి క్రీడాపోటీలకు ముందస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. పాఠశాలల స్థాయి క్రీడాపోటీలు నిర్వహణను మూడంచెల్లో నిర్వహించేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రణాళిక రూపొందిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయి పాఠశాలల క్రీడా క్యాలెండర్ ఖరారవడంతో అందుకనుగుణంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనేపథ్యాన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సూచనల మేరకు జిల్లా బాధ్యులు క్యాలెండర్ రూపొందించనున్నట్లు తెలిసింది. ఒక్కో జిల్లాకు కనీసం రెండు నుంచి మూడు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయిలో పోటీల నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశమున్నట్లు సమాచారం. గతంలో కేవలం ఎంపిక పోటీలు మాత్రం జిల్లాల్లో నిర్వహించగా ఈసారి అందుకు భిన్నంగా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహనకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు.

వేర్వురుగా.. విభాగాల వారీగా

జిల్లాస్థాయిలో పాఠశాలల క్రీడాపోటీలు మూడెంచల్లో నిర్వహిస్తారు. మండల, జోన్, జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలను అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఏర్పాటుచేస్తారు. అండర్–14, 17 కేటగిరీల్లో మాత్రం అన్ని స్థాయిల్లో నిర్వహించనుండగా.. అండర్–19 పోటీలను నేరుగా జిల్లా స్థాయిలో నిర్వహించే అవకాశముంది. జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ల కొరత.. ఒకరు మాత్రమే రెగ్యులర్ పీడీ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణంగా తెలుస్తోంది. మరోపక్క జిల్లాస్థాయిలో పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి నేతృత్వాన కమిటీని నియమిస్తారు. కాగా, ఈ పోటీలను సెప్టెంబర్ నెలలో నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది.

నిధులు ఎలా?

జిల్లాలో పాఠశాలల స్థాయి క్రీడాపోటీల నిర్వహణకు నిధులు ఎలా అనే సందేహం వెంటాడుతోంది. మండల, జోన్, జిల్లాస్థాయి క్రీడా పోటీలకు జిల్లా విద్యాశాఖ నుంచే నిధులు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లు స్పాన్సర్ల మీదే ఆధారపడి జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తుండంతో కొన్నిసార్లు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అలాకాకుండా జిల్లా విద్యాశాఖ క్రీడలపై దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తే సజావుగా పోటీలు నిర్వహించే అవకాశముంటుందనే భావన వ్యక్తమవుతోంది.

ఎట్టకేలకు ఎస్‌జీఎఫ్‌కు సొంత భవనం

జిల్లా కేంద్రంలో పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్)కు విద్యాశాఖ సొంత భవనాన్ని కేటాయించింది. ఖమ్మంలోని జమ్మిబండ ప్రాథమిక పాఠశాల భవనంలో రెండు గదులను శాశ్వతంగా ఎస్‌జీఎఫ్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈనేపథ్యాన అవసరమైన మరమ్మతులు చేయిస్తుండగా త్వరలోనే అక్కడి నుంచి కార్యకలాపాలు మొదలు కానున్నాయి.


గదులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

విశిష్ట పర్వదినం.. తొలి ఏకాదశి

నేడు హిందువుల తొలి పండుగ

- శ్రీమహా విష్ణువు యోగనిద్రలోకి వెళ్లే రోజు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నేటి నుంచి చాతుర్మాస వ్రతాలు ప్రారంభం



ఖమ్మంగాంధీచౌక్: ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ తొలి ఏకాదశి. హిందువులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ ఏకాదశికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. ఏడాది కాలంలో 24 ఏకాదశులు వస్తాయి. అందులో బుధవారం వచ్చే ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి'గా పిలుస్తారు. పురాణాల ప్రకారం.. శ్రీమహావిష్ణువు నేటి నుంచి నాలుగు నెలల పాటు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనిస్తాడు. అందుకే దీన్ని శయన ఏకాదశి అని కూడా అంటారు. ఇక ప్రత్యక్ష దైవమైన సూర్యుడు దక్షిణం వైపునకు మరలినట్లు, ఈరోజు నుంచి దక్షణాయనం ప్రారంభమవుతుంది. ఈ ఏకాదశి రోజున కొందరు చాతుర్మాస వ్రతాలు ప్రారంభిస్తారు. గోపద్మవ్రతం కూడా ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని కార్తీక మాస శుక్లపక్షం వరకు జరుపుకుంటారు. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే శ్రీహరిని పూజించి, విష్ణుమూర్తి ప్రతిమను పసుపు,కుంకుమ, పూలతో అలంకరించి చక్కెర పొంగలి నైవేద్యం పెట్టి కర్పూర హారతులివ్వటం ఆనవాయితీ. భక్తులు నేడు ఉపవాసం ఉంటూ, వైష్ణవ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఈ మేరకు అర్చకులు ఆలయాలను శుభ్రం చేసి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు.

పేలాల పిండి నైవేద్యం..

తొలి ఏకాదశి పేలాల పిండికి ప్రత్యేకం. ఈ పిండిని శ్రీ మహావిష్ణువుకు నైవేద్యం పెట్టి తప్పక తినాలని అంటారు. పేలాలు పితృ దేవతలకు కూడా ఎంతో ఇష్టమైనవని, జన్మనిచ్చిన వారిని ఈ రోజున గుర్తు చేసుకోవడం బాధ్యత అని పెద్దలు చెబుతుంటారు. అంతేగాక ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శరీరంలో అనేక మార్పులు వస్తుంటాయి. గ్రీష్మ రుతువు ముగిసి, వర్ష రుతువు ప్రారంభమయ్యే ఈ కాలంలో పేలాల పిండి తింటే ఆరోగ్యానికి మంచిదని అంటుంటారు.

రైతులకు ప్రత్యేకం..

తొలి ఏకాదశి రైతుల పండుగగా పురాణాలు చెబుతున్నాయి. రైతులు ఈ పండుగను వేడుకలా జరుపుకుంటారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, పంటలకు ఎలాంటి తెగుళ్లు ఆశించకుండా ఉండాలని కోరుకుంటూ తొలి ఏకాదశి రోజున ఇళ్లు, ఆలయాల్లో పూజలు చేస్తారు. 'ఏరు ముందా.. ఏకాశి ముందా..' అని చర్చించుకుంటారు. వర్షాలు అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు భగంవతుడిని ప్రార్థిస్తారు.

మార్పులకు సంకేతం



ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతం తొలి ఏకాదశి. సూర్య భగవానుడు ఈ రోజు నుంచి దక్షణాయనం వైపునకు మరలుతాడు. హిందువులు తొలి ఏకాదశిని మొదటి పండుగగా జరుపుకుంటారు. రైతులకు ఈ పండుగ ప్రత్యేకం. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ప్రజలు తొలి ఏకాదశి రోజున ఉపవాసాలు, జాగరణలు చేస్తారు.

– నందుల సుబ్రమణ్య శర్మ, పురోహితులు, ఖమ్మం

క్లెయిమ్‌లు సరిచేసుకునేందుకు అవకాశం


మాట్లాడుతున్న ఆదాయపన్ను శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: సందేహాస్పదంగా సమర్పించిన క్లెయిమ్‌లను సరిదిద్దుకునే అవకాశం కల్పించినట్లు ఆదాయ పన్ను శాఖ అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆదాయ పన్ను రీఫండ్‌క్లెయిమ్‌లపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సందేహాస్పదంగా క్లెయిమ్ చేయడమే కాక రీఫండ్‌ను క్లెయిమ్ చేయడం వల్ల ఎదురయ్యే పరిణామాలను వివరించారు. ఇలాంటివి అప్‌డేట్ చేసుకుంటే ఆదాయ పన్ను చెల్లించే అవకాశం కల్పించామని తెలిపారు. ఈమేరకు జరిమానా, ప్రాసిక్యూషన్ల బారిన పడకుండా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆదాయపన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర చైతన్య, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సేవలకు గుర్తింపు


అవార్డులు అందుకున్న ఉద్యోగులతో నోడల్ అధికారి, ఎస్ఈ

ఖమ్మంవ్యవసాయం: విధినిర్వహణలో ప్రతిభ ఆధారంగా విద్యుత్ ఉద్యోగులకు ఎన్పీడీసీఎల్ ర్యాంకులు ప్రకటించింది.ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో పనిచేసే ఏఈ, ఏడీఈ, డీఈ, ఎస్ఈలకు మే నెలకు సంబంధించి ర్యాంకులు ప్రకటించగా జిల్లా ఉద్యోగులకు స్థానం దక్కింది. ఉత్తమ రూరల్ ఏఈగా కె.రామారావు(నేలకొండపల్లి), ఉత్తమ అర్బన్ ఏఈగా ప్రభాకర్(ఖమ్మం టౌన్–5), ఉత్తమ ఏడీఈగా సీహెచ్.నాగార్జున(ఖమ్మం టౌన్–1), ఉత్తమ ఏఈగా వి.నారాయణ(పమ్మి) ర్యాంకు దక్కించుకున్నారు. వీరికి ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా నోడల్ ఆఫీసర్ నాగప్రసాద్, ఎస్ఈ ఏ.సురేందర్‌లు అవార్డులు అందించి సన్మానించారు.

జీతాల కోసం 'భగీరథ' కార్మికుల ఆందోళన


కంపెనీ ప్రతినిధులను నిలదీస్తున్న కార్మికులు

తిరుమలాయపాలెం: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో జీవనం ఎలా సాగించాలంటూ కార్మికులు ఆందోళనకు దిగారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలోని భగీరథ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టగా చర్చించేందుకు వచ్చిన ఎల్ అండ్ టీ కంపెనీ జిల్లా మేనేజర్‌ను నిర్బంధించారు. ప్రభుత్వం నుండి బిల్లులు రాగానే ఇస్తామని ఆయన చెప్పడంతో కార్మికులు మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ గిరిధర్‌రెడ్డి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. వేతనాలు చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని సూచించినా ఎల్ అండ్ బీ అధికారులు ఎటూ తేల్చలేదు. దీంతో కార్మికులు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు నెలనెలా రూ.19 వేలకు బదులు రూ.13 వేలే ఇస్తున్నారని, అంతేకాక నాలుగు మండలాలకు కలిసి ఒకే జేసీబీ కేటాయించడంతో పైపులైన్ల మరమ్మతుకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. కాగా, కార్మికుల ఆందోళనతో పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది.

లింక్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలి


ఎన్నెస్పీ కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: గోదావరి జలాల తరలింపునకు నిర్దేశించిన సీతారామ ప్రాజెక్టులో భాగమైన లింక్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలని ప్రాజెక్టు సీఈ విద్యాసాగర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం నూకలంపాడు, శ్రీరామగిరి, బురదరాఘవాపురం, ఆరికాయలపాడు, పీకే బంజరల్లో ఎన్నెస్పీ కాల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. సీతారామ లింక్ కెనాల్ పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి నీరు విడుదల చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అనన్య, నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, మేడ ధర్మారావు, యండ్రాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఖమ్మంక్రైం: మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని రాయల్ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న నూనె కవిత(46)భర్త ఏడాదిన్నర క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బొద్దింకలు చంపేందుకు వాడే మందు తాగింది. కాసేపయ్యాక గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడి ఫిర్యాదుతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు భరోసా


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: ఆపదలో ఉన్న ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు కుటుంబ భరోసా పథకం అండగా ఉంటోందని తెలంగాణ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు ఆయన ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఫొటోగ్రాఫర్లు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 101మంది కుటుంబాలకు రూ.1.70కోట్లు పరిహారం ఇప్పించినట్లు చెప్పారు. నాయకులు పి.రవి, జి.ఎల్లయ్య, రఘురాంప్రసాద్, బాలాజీనాయక్, రమేష్, ఎస్.కే.యాసిన్, లక్కి, తిరుపతి, రామయ్య పాల్గొన్నారు.

పాత కక్షలతో కత్తుల దాడి

- రాళ్లు, కత్తుల దాడితో మర్లపాడులో ఉద్రిక్తత
- ఇద్దరికి తీవ్రగాయాలు


భుజంపై గాయంతో సురేష్


గాయపడిన రవి

వేంసూరు: వేంసూరు మండలం మర్లపాడులో పాత కక్షల నేపథ్యాన ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అందరూ చూస్తుండగానే గ్రామసెంటర్‌లో, మునుపెన్నడూ లేని విధంగా కత్తులతో దాడి జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఇస్సంపల్లి సురేష్ అదే గ్రామానికి చెందిన నడ్డి రవి మధ్య గతంలో కుటుంబ గొడవలు ఉన్నాయి. పలుమార్లు పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించారు. ఈనేపథ్యాన మంగళవారం ఇసంపల్లి సురేష్, ఆయన బావమరిది పల్లెపోగు సురేష్ మర్లపాడు రింగ్ సెంటర్‌లో ఉండగా.. నడ్డి రవి రాళ్లు విసురుతూనే కత్తులతో దాడి చేశాడు. ఈక్రమంలో స్థానికుల రవిని అడ్డుకున్నారు. ఇంతలోనే పల్లెపోగు సురేష్ సైతం రాయి విసరడంతో రవి తలకు తాకి గాయాలయ్యాయి. ఈమేరకు తీవ్రంగా గాయపడిన ఇసంపల్లి సురేష్, రవిని సత్తుపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా, సురేష్ తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

గంజాయి విక్రయదారుడికి కౌన్సెలింగ్?

బోనకల్: మండలంలోని రాపల్లికి చెందిన ఓ వ్యక్తిని గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో బోనకల్ ఎస్ఐ మధుబాబు ఆయనను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సమాచారం. ఇటీవల బోనకల్ మండలం రావినూతల వద్ద 16.5 కేజీల గంజాయి పట్టుబడడంతో పోలీసులు అప్రమతమత్తమయ్యారు. ఈనేపథ్యాన ఎవరెవరు గంజాయి అమ్ముతున్నారో ఆరా తీయగా.. రాపల్లికి చెందిన వ్యక్తి ఏపీలో గంజాయితో పడినట్లు గుర్తించారు. ఈ నేపథ్యాన ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయనకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనం చోరీ

మధిరరూరల్: మధిరలోని బస్టాండ్ వెనక శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్–2లో నివాసముంటున్న రెహమాన్‌కు చెందిన ద్విచక్ర వాహనం సోమవారం రాత్రి చోరీకి గురైంది. రోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో పెట్టి తాళం వేసిన ఆయన నిద్రించాడు. మంగళవారం ఉదయంకల్లా ద్విచక్ర వాహనం లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. కాగా, మధిర పట్టణంలో కొంతకాలంగా తరచూ ద్విచక్ర వాహనాల చోరీలు జరుగుతున్నా నియంత్రించే వారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు.

28 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి సమీపాన నిల్వ చేసిన 28క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. చిరుమర్రి శివారు కోళ్లఫారంలో అక్రమంగా బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో మంగళవారం తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా కోళ్లఫారం నిర్వాహకుడు లక్ష్మణ్ నుంచి 28క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని సవిల్ సప్లయీస్ అధికారులతో అప్పగించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు

కొత్తగూడెంటౌన్: హత్యకు గురైన మహిళ భర్తపై తప్పుడు కథనాలు రాస్తామని జర్నలిస్టులుగా చెప్పుకున్న ముగ్గురు బెదిరించి డబ్బు డిమాండ్ చేయగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశా రు. కొత్తగూడెం సన్యాసిబస్తీకి చెందిన దాసరి పూర్ణపై ఆమె భర్త శ్రీనివాసరావు దాడి చేయడంతో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్ను మూసింది. కుటుంబీకులు సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా వారి ఇంటికి వెళ్లిన రమే శ్, గణేశ్, కృష్ణమూర్తి జర్నలిస్టులుగా పరిచయం చేసుకు న్నారు. శ్రీనివాసరావుకు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు రాయొద్దంటే డబ్బు ఇవ్వాలని ఆయన కుమారుడు కార్తీక్‌ను బెదిరించారు. అంతేకాక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ మేరకు కార్తీక్ ఫిర్యాదుతో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

- బంగారు ఆభరణాల చోరీ కోసమే హత్య చేసినట్లు సందేహం
- ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు


సక్రి మృతదేహం

కారేపల్లి: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని సామ్యాతండా గ్రామంలో మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సామ్యాతండాకు చెందిన గుగులోతు సక్రి(65) భర్త సామ్యా సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాక కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహాలు కావడంతో ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. సక్రి మాత్రం కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలోని ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఏటా మొహర్రం పండగ సందర్భంగా గ్రామంలోని ఇంట్లో పీర్ల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుండగా సక్రికి మంగళవారం కుమార్తెలు ఫోన్ చేశారు. ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా ఆమె స్పందించకపోవడంతో గ్రామంలోని మరో వీధిలో ఉంటున్న సోదరుడు, బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు సాయంత్రం వెళ్లి చూసేసరికి సక్రి రక్తపు మడుగులో విగతజీవిగా ఉండడాన్ని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఒంటరిగా ఉంటున్న విషయాన్ని గుర్తించి హత్య చేశాక బంగారు దిద్దులు, కాళ్ల పట్టీలు, ఇంట్లో భద్రపర్చిన రూ.50వేల నగదు ఎత్తుకెళ్లినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలిలో గొడ్డలి, సుత్తి ఉండడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కుటుంబీకులు ఇచ్చిన సమాచారంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, సిబ్బంది చేరుకుని దర్యాప్తు ఆరంభించారు.